క్లుప్తంగా

మహిళా ఆరోగ్య కేంద్రాలకు స్పందన



ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను పర్యవేక్షిస్తున్న ఎంపీడీఓ శంకర్

అల్లాదుర్గం (మెదక్): ప్రభుత్వం కొత్తగా ఏర్పాటు చేసిన మహిళ ఆరోగ్య కేంద్రాలకు మంచి స్పందన వస్తుందని ఎంపీడీఓ శంకర్ చెప్పారు. మంగళవారం అల్లాదుర్గం మహిళ ఆరోగ్య కేంద్రాన్ని ఆయన పర్యవేక్షించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి మంగళ వారం అల్లాదుర్గం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో మహిళలకు ప్రత్యేకంగా వైద్య సేవలు అందిస్తున్నాట్లు చెప్పారు. అన్నిరకాల పరీక్షలు ఉచితంగా చేసి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కేంద్రాలకు ప్రతి మంగళవారం వంద మందికిపైగా మహిళలకు వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగు భాష దినోత్సవం



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

శివ్వంపేట (నర్సాపూర్): మండల పరిధి పెద్ద గొట్టిముక్ల ఉన్నత పాఠశాలలో మంగళవారం తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు ఆంగ్ల పదాలు రాకుండా తెలుగు మాట్లాడే విధంగా ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు జంగం రాజు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తెలుగుభాషకు ఉన్న గొప్పదనం మరో భాషకు లేదన్నారు. కార్యక్రమంలో తెలుగు ఉపాధ్యాయుడు వేల్పుల రాజు, శంకర్, మానస, సంతోషి, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

మోతాదుకు మించి వాడొద్దు

- వ్యవసాయ అధికారి నాగమాధురి



ర్యాలమడుగులో పంటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనివాస్

హవేళీఘనపూర్: మండల పరిధిలోని ఫరీద్‌పూర్‌లో మండల వ్యవసాయ అధికారి నాగమాధురి మంగళవారం వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు సూచించిన మేరకు యూరియాను తగిన మోతాదులో వినియోగించాలని రైతులకు సూచించారు. అనంతరం ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేశారు. అలాగే మెదక్ మండల పరిధిలోని ర్యాలమడుగులో మెదక్ మండల ఏవో శ్రీనివాస్ వరి పంటను పరిశీలించారు. పంటకు చీడపీడలు సోకకుండా నివారణకు సస్యరక్షణ చేపట్టాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఫరీద్‌పూర్ ఎంపీటీసీ రాజయ్య, పీఏసీఎస్ చైర్మన్ బ్రహ్మం, ఏఈవో భార్గవ్, ర్యాలమడుగు రైతులు జయరాంరెడ్డి, ఏఈవో రాజశేఖర్ రైతులు ఉన్నారు.

హద్దుల ఏర్పాటు

చేగుంట (తూప్రాన్): మండలంలోని వడియారం శివారులోని అటవీ హద్దులను మంగళవారం ఏర్పాటు చేశారు. మాసాయిపేట మండలం రామంతపూర్ తండావాసులు వడియారం అటవీ శివారులో కడీలను పాతారు. సమాచారం అందుకున్న అధికారులు మంగళవారం సర్వే చేయించి హద్దులతో పాటు ఫారెస్టు బోర్డును ఏర్పాటు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో వడియారం, రామంతపూర్ తండావాసులు పాల్గొన్నారు.

బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ అవసరం

మనోహరాబాద్(తూప్రాన్): బాలికలకు సెల్ఫ్ డిఫెన్స్ ఎంతో అవసరమని, బ్యాడ్ టచ్, గుడ్ టచ్‌లపై విద్యార్థులకు సఖీ సెంటర్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. మంగళవారం మనోహరాబాద్ మండలం రంగాయపల్లి ఉన్నత పాఠశాలలో బాలబాలికలకు పలు అంశాలపై లీగల్ అడ్వైజర్ నిర్మల, సఖి సెంటర్ సభ్యురాలు కళావతి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం సంజీవరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మొక్కలు తొలగించిన అధికారులు

మెదక్ కలెక్టరేట్: సాక్షి కథనానికి అధికారులు స్పందించారు. ఈ మొక్కలకు దిక్కెవరు అనే పేరిట కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు కలెక్టరేట్ ప్రధాన గేటు వద్ద గల మొక్కలను నర్సరీకి తరలించారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత ఏదీ?

- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై కౌన్సిలర్ల ఆగ్రహం



మున్సిపల్ సమావేశంలో పాల్గొన్న చైర్మన్, కౌన్సిలర్లు, అధికారులు

నర్సాపూర్: మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనుల పర్యవేక్షణ లేక నాణ్యత లేకుండా పోతుందని పలువురు కౌన్సిలర్లు ఆరోపించారు. మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్ అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో కౌన్సిలర్ రామచందర్ మాట్లాడుతూ పట్టణంలో చేపడుతున్న నిర్మాణ పనులను పర్యవేక్షించడం లేదని, దీంతో పనులలో నాణ్యత లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్మన్ మురళీయాదవ్, వైస్ చైర్మన్ నయిమొద్దీన్, కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, బుచ్చేష్ యాదవ్, రామచందర్ తదితరులు మాట్లాడుతూ నిర్మాణ పనులు కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారని ఆరోపించారు. పనులు ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియడం లేదన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ యార్డు భవనానికి పిల్లర్ల సైజును ఎక్కువగా చేపట్టారని, ప్రజాధనం వృథా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. శ్మశాన వాటిక తదితర నిర్మాణ పనులు నిదానంగా సాగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఏఈ కృష్ణయ్య మాట్లాడుతూ ఉన్నతాధికారుల సూచనల మేరకు పిల్లర్ల నిర్మాణం చేపట్టామని, మార్కెట్ యార్డు నిర్మాణం రెండు నెలల్లో పూర్తవుతుందని, శ్మశాన వాటిక త్వరలో పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రెండు సంవత్సరాల నుంచి పట్టణంలో ఒక్క కొత్త స్తంభం ఏర్పాటు చేయలేదని కౌన్సిలర్లు అశోక్‌గౌడ్, సురేశ్, బుచ్చేష్‌యాదవ్, యాదగిరి, రాజేందర్, రామచందర్ తదితరులు కోరారు. సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరి చేయిస్తానని కమిషనర్ వెంకట్‌గోపాల్ హామీ ఇచ్చారు. కాగా సుమారు రెండేళ్ల క్రితం ముఖ్యమంత్రి కేసీఆర్ మంజూరు చేసిన నిధులను సద్వినియోగం చేసుకోలేకపోవడం విచారకరమని పలువురు కౌన్సిలర్లు విచారం వ్యక్తం చేశారు. సీఎం ఇచ్చిన నిధులతో పట్టణంలోని ప్రధాన రోడ్లను సీసీ రోడ్లుగా మార్చడంతోపాటు మురికి కాలువలు నిర్మించాలని వైస్ చైర్మన్ నయిమొద్దీన్, పలువురు కౌన్సిలర్లు కోరారు. పలు రోడ్ల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపామని ఆమోదం రాగానే ఆయా రోడ్ల నిర్మాణ పనులు చేపడుతామని పీఆర్ ఏఈ స్వామిదాస్ చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్లు లలిత, లత, రుక్కమ్మ, సిద్దిఖా, సరిత తదితరులు పాల్గొన్నారు.

ఏడుపాయలలో ఎమ్మెల్సీ పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి దంపతులు

పాపన్నపేట(మెదక్): మండలంలోని ఏడుపాయల వనదుర్గమ్మను మంగళవారం ఎమ్మెల్సీ శేరిసుభాష్ రెడ్డి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ తరఫున ఈఓ సార శ్రీనివాస్ ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజలను నిర్వహించిన పార్థివశర్మ ఎమ్మెల్సీ దంపతులకు తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ కమిటీ తరఫున ఎమ్మెల్సీని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బస్సును పునరుద్ధరించాలి

శివ్వంపేట(నర్సాపూర్): వెల్దుర్తి నుంచి సికింద్రాబాద్‌కు గతంలో నడిచిన బస్సును పునరుద్ధరించాలని కోరుతూ మంగళవారం నర్సాపూర్ ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. శివ్వంపేట మండలం నవాబుపేట, లచ్చిరెడ్డిగూడం, గోమారం, చండి, ఉసిరికపల్లి, పాంబండ, పోతులబోగూడ మీదుగా వెల్దుర్తి నుంచి సికింద్రాబాద్‌కు ఉదయం, సాయంత్రం వేళల్లో నడిచిన బస్సు రద్దు కావడం వల్ల ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు. ఈ సందర్భంగా చండి గ్రామానికి చెందిన గ్రామస్తులు వినతిపత్రం అందజేశారు.

మీ బిడ్డలా ఆదరించండి

- మెదక్‌ను అభివృద్ధి చేస్తా: మైనంపల్లి రోహిత్



మాట్లాడుతున్న రోహిత్

హవేళీఘనపూర్: ప్రజాసేవే లక్ష్యంగా పని చేస్తున్న తనను ఆదరించాలని మైనంపల్లి సోషల్ సర్వీస్ చైర్మన్ మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గాజిరెడ్డిపల్లిలో ఎంఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. అలాగే గ్రామానికి చెందిన 20 మంది నిరుపేద ఆడబిడ్డలకు రూ.25వేల చొప్పున ఫిక్స్‌డిపాజిట్ చేసిన బుక్‌లను అందజేశారు. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ గాజిరెడ్డిపల్లిలో తాగునీటి సమస్య పరిష్కారానికి మూడు బోర్లు వేయించానని, అలాగే.. మినరల్ వాటర్ ప్లాంట్‌ను నిర్మించాలని సూచించినట్లు తెలిపారు. మెదక్ జిల్లాలో ఉన్న ఎన్నో ప్రభుత్వ కార్యాలయాలు, మహిళా డిగ్రీ కళాశాలను సిద్దిపేటకు తరలించినా ఇక్కడి పాలకులు పట్టించుకోలేదని విమర్శించారు. రాబోయే రోజుల్లో ఏదో చేస్తానంటూ ప్రగల్భాలు పలికి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. ప్రజా సేవయే లక్ష్యంగా ఎంచుకున్న తనను సమాజ సేవకుడిగా.. మీ బిడ్డగా ఆదరించినట్లయితే మెదక్‌ను అభివృద్ధి చేసిచూపుతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాపన్నపేట ఎంపీపీ ప్రశాంత్‌రెడ్డి, కూచన్‌పల్లి సర్పంచ్ దేవాగౌడ్, మాజీ సర్పంచ్ మహేందర్‌రెడ్డి, ఎంఎస్ఎస్‌వో సభ్యులు పరుశురామ్‌గౌడ్, బొజ్జ పవన్, వెంకట్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

ఇటాలియన్ ఆఫ్ ఈస్ట్‌గా తెలుగు

- ప్రముఖ రచయిత, కవి డా.సూర్యప్రకాశ్ రావు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

నర్సాపూర్ రూరల్: ఆధునిక కాలంలోనూ తెలుగు ప్రత్యేకతను నిలుపుకుంటోందని, 'ఇటాలియన్ ఆఫ్ ద ఈస్ట్'గా గుర్తింపు పొందిందని రచయిత, కవి డాక్టర్ సూర్యప్రకాశ్ రావు అన్నారు. మంగళవారం నర్సాపూర్ మండలం కాగజ్ మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక విషయాలను కూడా తెలుగులో నేర్చుకోవచ్చని వివరించారు. వ్యవహారిక భాష ప్రా చుర్యం పొందేందుకు గిడుగు వేంకట రామమూర్తి చేసిన కృషిని తెలుగు జాతి ఎప్పటికీ మరిచిపోదని పేర్కొన్నారు. గిడుగు వేసిన పునాదులపైనే పత్రికల్లోనూ, రచనల్లోనూ వ్యవహారిక భాషకు పెద్దపీట వేస్తున్నారన్నారు. ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాషలో ఏదైనా విషయాన్ని తేలికగా వివరించవచ్చని పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఏ.శ్రీనివాస్ అన్నారు. తెలుగులో సంభాషించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు అప్పల నాయుడు తెలుగు భాషపై పాడిన పాట విద్యార్థులను అలరించింది. కాగా, తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో ప్రత్యే క పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేంకటేశ్వర రావు, సురేశ్, షరీఫ్, కవిత తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన



పోషకాహారంపై అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

పెద్దశంకరంపేట (మెదక్): పోషకాహార అలవాట్లపై పెద్దశంకరంపేటలోని మంథన్ స్కూల్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వృద్ధులకు, మహిళలకు పోషకాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండవచ్చని వివరించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ నాగనాథ్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కిషన్‌రెడ్డికి నివాళి



కౌడిపల్లిలో కిషన్‌రెడ్డికి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

కౌడిపల్లి (నర్సాపూర్): కనీస వేతన బోర్డు చైర్మన్, బీఆర్ఎస్ నాయకుడు దివంగత చిలుముల కిషన్‌రెడ్డికి ఎమ్మెల్యే మదన్‌రెడ్డి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కిషన్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కిషన్‌రెడ్డి భార్య సుహాసినిరెడ్డి, జిల్లా గ్రంథాల సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మన్సూర్, ఎంపీపీ రాజునాయక్, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు సార రామాగౌడ్, యూత్ అధ్యక్షుడు కృష్ణాగౌడ్, వైస్ చైర్మన్ చిన్నంరెడ్డి పాల్గొన్నారు.

మెరుగైన ఉపాధి అందిస్తాం

- యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కైజర్



దేవులపల్లిలో ప్రచారం చేస్తున్న కైజర్, తదితరులు

కౌడిపల్లి (నర్సాపూర్): కాంగ్రెస్ అధికారంలోనికి రాగానే యూత్ డిక్లరేషన్ అమలు పరిచి యువతకు మెరుగైన ఉపాధి అందిస్తామని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి కైజర్ అన్నారు. మంగళవారం మండలంలోని దేవులపల్లిలో మండలం యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం యువతను పట్టించుకోవడం లేదని విమర్శించారు. యూత్‌ను జెండాలు మోసే కార్యకర్తలుగానే చూస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోని రాగానే హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ అమలుచేసి యువతకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులకు ఆదుకునేందుకు రైతు డిక్లరేషన్‌తోపాటు మహిళ డిక్లరేషన్ అమలు చేస్తామని రూ 500 సిలిండర్, రూ 15వేలు రైతుబంధు, నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తేనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో నర్సాపూర్ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు రియాజ్‌అలీ, మండల యూత్ అధ్యక్షుడు ధన్‌సింగ్, మహిళ అధ్యక్షురాలు మల్లేశ్వరీ, నాయకులు పూల్‌సింగ్, శంకర్, మనోహర్, మల్లేశ్, ప్రవీణ్, రమేశ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు సంక్షేమం

రేగోడ్(మెదక్): అన్ని వర్గాల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు త్రిష దామోదర్ అన్నారు. మండలంలోని చౌదర్‌పల్లి, కొత్వాన్‌పల్లి గ్రామాల్లో మంగళవారం ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడారు. తన తండ్రి దామోదర్ రాజనర్సింహ చేసిన అభివృద్ధి పనులను వివరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిందేమీ లేదని, ఉత్త హామీలను ఇస్తూ ప్రజలను మభ్య పెడుతోందని ధ్వజమెత్తారు. మీకు అండగా ఉంటా, ఎవరూ అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ సభ్యుడు యాదగిరి, ఎంపీపీ సరోజన, పార్టీ అధ్యక్షుడు ఎస్.దిగంబర్‌రావ్, కో ఆప్షన్ సభ్యుడు చోటుమియా, ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు పీర్యానాయక్, మాజీ సర్పంచ్ గంజి సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పంట నష్ట పరిహారం చెక్కులు పంపిణీ

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్రంలోని అన్ని వర్గాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎంపీపీ స్వరూప, జడ్పీటీసీ రమేశ్‌గౌడ్ అన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో వర్షాలకు దెబ్బ తిన్న ఇళ్ల బాధితులకు మంజూరైన నష్టపరిహారం చెక్కులను మంగళవారం అందజేశారు. తహసీల్దార్ తులసీరాం, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, గిర్దావర్ జయభారత్‌రెడ్డి, ఎంపీడీఓ వెంకటలక్ష్మమ్మ, ఎంపీటీసీలు మోహన్ రెడ్డి, భాస్కర్‌గౌడ్, బాబు పాల్గొన్నారు.

కాలకంఠి బంగారమ్మకు ఎంపీ పూజలు

మనోహరాబాద్(తూప్రాన్): మనోహరాబాద్ మండలం కాళ్ళకల్‌లో గల కాలకంఠి బంగారమ్మను మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. నాలుగు రోజులుగా జరుగుతున్న అమ్మవారి ఉత్సవాలలో భాగంగా ఎంపీ విచ్చేసినట్లు గ్రామ సర్పంచ్ నత్తి మల్లేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పురం మహేష్, వైస్ఎంపీపీ విఠల్‌రెడ్డిలు సన్మానించారు. సుధాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, భిక్షపతి, పురం రవి, సాదు సత్యనారాయణ, వెంకట్, మణికంఠ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ ఘనంగా తెలుగు భాషా వేడుకలు

వెల్దుర్తి(తూప్రాన్): తెలుగు కవి గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా మండల కేంద్రం వెల్దుర్తిలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులంతా తెలంగాణ భాషా దినోత్సవం ఆకృతిలో కూర్చొని తెలుగుపట్ల వారికున్న మక్కువ ప్రదర్శించారు. అలాగే.. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ క్రీడా దినోత్సవంలో భాగంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు.

◆ తెరుచుకోని రైల్వేగేటు.. వాహనదారుల ఇక్కట్లు

చేగుంట(తూప్రాన్): రైల్వేగేట్ లాక్ తెరుచుకోక పోవడంతో గంట పాటు ట్రాఫిక్‌జామ్ ఏర్పడింది. దీంతో ప్రయాణికులు, వాహనదారులు అనేక ఇబ్బంది పడ్డారు. మంగళవారం ఉదయం నిజామాబాద్ వైపు వెళుతున్న రైలు కోసం చేగుంట–మెదక్ రహదారి రైల్వేగేట్‌ను వేశారు. రైలు వెళ్లిపోయినా ఒక వైపు లాక్ తెరుచుకోలేదు. దీంతో వాహనాలు గేటు వద్దనే నిలిచిపోయాయి. అప్పటికే కాచిగూడ–ముత్కేర్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ వచ్చే సమయం కావడంతో రైలు పట్టాలపై వాహనాలు నిలిచిపోవడంతో సిబ్బంది అప్రమత్తమై చాకచక్యంగా గేటును తీశారు.

◆ విద్యార్థులకు శిక్షణ

నర్సాపూర్: నర్సాపూర్‌లోని జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తమ కాలేజీ తరపున పలు అంశాలపై శిక్షణ కార్యక్రమం చేపడుతున్నామని బీవీ రాజు ఇంజనీరింగ్ కాలేజీ కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ బ్రాంచ్ హెచ్ఓడీ మధుబాబు మంగళవారం తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశంపై విద్యార్థులకు ఐదు రోజుల పాటు అవగాహన కల్పిస్తామని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ– సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చి బోర్డు సహకారంతో శిక్షణ కార్యక్రమం చేపడుతున్నామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో కాలేజీ ప్రతినిధులు పాల్గొని విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

◆ జిల్లా కేంద్రంలో స్థలం కేటాయించండి

మెదక్ కలెక్టరేట్: తమకు జిల్లా కేంద్రంలో ఎకరా స్థలం కేటాయించాలని నాయీ బ్రాహ్మణ ఐక్యవేదిక మెదక్ జిల్లా అధ్యక్షుడు స్వామి కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ రాజర్షిషాను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ మధుసూదన్, గౌరవ అధ్యక్షుడు రమేష్, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ పాల్గొన్నారు.

◆ మున్సిపల్ ఎంప్లాయీస్ కమిటీ ఎన్నిక

మెదక్ మున్సిపాలిటీ: మెదక్ మున్సిపల్ ఎంప్లాయిస్ కమిటీని కమిషనర్ జానకీరాం సాగర్ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మున్సిపల్ రెవెన్యూ అధికారి అర్షద్ అహ్మద్, కార్యదర్శిగా మెదక్ మున్సిపాలిటీ సీనియర్ అసిస్టెంట్ శ్రీపాల్‌రెడ్డి, అసోసియేట్ అధ్యక్షుడిగా తూప్రాన్ మున్సిపాలిటీ మేనేజర్ రఘువరన్, కోశాధికారిగా నర్సాపూర్ మున్సిపాలిటీ మేనేజర్ మధుసూదన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్(మున్సిపల్ మేనేజర్, రామాయంపేట), దుర్గయ్య(జూనియర్ అసిస్టెంట్, తూప్రాన్), మహబూబ్(మెదక్ వార్డు ఆఫీసర్)తదితరులను ఎన్నుకున్నారు.

◆ క్రీడాప్రాంగణంలో భవన నిర్మాణం చేపట్టొద్దు

టేక్మాల్(మెదక్): క్రీడా ప్రాంగణంలో గ్రామ పంచాయతీ భవన నిర్మాణాన్ని చేపట్టవద్దని టేక్మాల్ మండలంలోని మల్కాపూర్ గ్రామస్తులు మంగళవారం సూపరింటెండెంట్ విష్ణువర్ధన్‌కు వినతిపత్రం అందజేశారు. క్రీడాప్రాగణంలో కాకుండా గ్రామస్తులంతా నిర్ణయించిన స్థలంలోనే నిర్మాణం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాజుగౌడ్, శంకర్, గ్రామస్తులు మైపాల్, నవీన్, గోపాల్, సుదర్శనం, యాదయ్య, సత్యయ్య, ఈశ్వరయ్య, సుధాకర్ పాల్గొన్నారు.

◆ దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ కలెక్టరేట్: జిల్లాలోని ఎస్సీ విద్యార్థులు 2023–24 విద్యా సంవత్సరంలో నూతన, రెన్యువల్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారి విజయలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పూర్తి సమాచారం కోసం ప్రభుత్వ వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు.

◆ పూరిగుడిసె దగ్ధం

కొల్చారం(నర్సాపూర్): ప్రమాదవశాత్తు పూరి గుడిసె దగ్ధమైన ఘటన సంఘటన మండల పరిధిలోని వసురాం గిరిజన తండాలో మంగళవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన లాల్య కుటుంబం పనుల నిమిత్తం సమీపంలోని పొలంలోకి వెళ్లారు. ఈ క్రమంలో సాయంత్రం సమయంలో పూరిగుడిసె వెనక భాగం నుంచి రేగిన మంటలతో గుడిసె పూర్తిగా దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గుడిసెలో దాచిన మూడు తులాల బంగారం, 30 తులాల వెండి వస్తువులు పూర్తిగా కాలిబూడిదైనట్లు బాధితుడు బోరున విలపించాడు. ప్రభుత్వం తన కుటుంబాన్ని ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

◆ నూతన కార్యవర్గం

మెదక్: పట్టణ సుందరీకరణలో మున్సిపల్ ఉద్యోగుల సేవలు అభినందనీయమని టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ అన్నారు. మంగళవారం టీఎన్జీఓ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ ఉద్యోగుల జిల్లా ఫోరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా హర్షద్ అహ్మద్, ప్రధాన కార్యదర్శిగా పాల్ రెడ్డి, సహ అధ్యక్షుడిగా రఘువరన్, కోశాధికారి మధుసూదన్, ఉపాధ్యక్షులుగా శ్రీనివాస్, దుర్గయ్య, సంయుక్త కార్యదర్శులుగా మహేష్, పద్మ, కార్యనిర్వాహక కార్యదర్శి రాంభూపాల్ రెడ్డి, ప్రచార కార్యదర్శి నాగరాజు, కార్యవర్గ సభ్యులుగా బాబు, శ్రీధర్ రెడ్డి, ఆబెద్ అలీలను ఎన్నుకున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రాజ్ కుమార్ తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫోరం కన్వీనర్ ప్రభాకర్, సభ్యులు బట్టి రమేష్, శ్రీనివాస్ గౌడ్, వెంకట గోపాల్, మెదక్ యూనిట్ అధ్యక్షుడు పంపరి శివాజీ, జిల్లా ఉపాధ్యక్షులు మంగ మనోహర్, ఎండీ ఫజలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ దుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే

పాపన్నపేట(మెదక్): ఏడుపాయల దుర్గమ్మను మంగళవారం నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగాఈఓ సార శ్రీనివాస్ ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి, శాలువాతో సత్కరించారు. పూజారులు శంకరశర్మ, పార్థివశర్మలు అమ్మవారికి అర్చన చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయనతో నర్సాపూర్ బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

◆ ఎంజేపీలో జాతీయ క్రీడా దినోత్సవం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి ఎంజేపీ (మహాత్మ జ్యోతిబాపూలే) బీసీ గురుకుల పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ శివప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులను క్రీడాపోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులచేత నేషనల్ స్పోర్ట్స్‌డే ఆకారంలో కూర్చోబెట్టి ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పీడీ రాజన్న, పీఈటీలు కార్తిక్, శేఖర్ పాల్గొన్నారు.

◆ సరస్వతీ శిశుమందిర్‌లో..

మెదక్ మున్సిపాలిటీ: జాతీయ క్రీడా దినోత్సవాన్ని మెదక్ పట్టణంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పలు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆనంద్‌రెడ్డి విద్యార్థులతో కబడ్డీ, ఖోఖో, చైర్ తదితర ఆటలు ఆడించారు. కార్యక్రమంలో పాఠశాల ఆచార్య బృందం పాల్గొన్నారు.

◆ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

నర్సాపూర్: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ ఆశ వర్కర్లకు పారితోషికం నెలకు రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆశవర్కర్లతో వెట్టి చేయిస్తుందని ఆరోపించారు. నామమాత్రంగా నెలకు రూ. 9750 పారితోషికం ఇస్తూ ఆర్థిక ఇబ్బందుల్లోకి ప్రభుత్వం నెట్టుతోందని చెప్పారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ల సంఘం నాయకులు రేణుక, పద్మ, శాంతమ్మ, లావణ్య, శిరీష, మంజుల, స్వప్న, సబిత, సునంద తదితరులు పాల్గొన్నారు.

◆ హామీలు నెరవేర్చాలని వినతి

నర్సాపూర్: గత ఎన్నికలలో బీఆర్ఎస్ ఇచ్చిన హామీలు అమలు చేయాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రమణరావు డిమాండ్ చేశారు. పలువురు నాయకులతో కలిసి మంగళవారం ఆర్‌డీఓ శ్రీనివాసులుకు వినతిపత్రం అందచేశారు. గత ఎన్నికలప్పుడు బీఆర్ఎస్ నాయకులు అనేక హామీలు ఇచ్చారని, వాటన్నింటిని నెరవేర్చాలని కోరారు. నర్సాపూర్ నియోజకవర్గంలో సైతం అనేక హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

◆ ఆ కళాశాల గుర్తింపు రద్దు చేయాలి

మెదక్ కలెక్టరేట్: విద్యాహక్కు చట్టానికి వ్యతిరేకంగా అడ్మిషన్ల పేరుతో వేల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న తూప్రాన్‌లోని మాస్టర్ మైండ్ కళాశాల గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో డీఐఈఓకు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ జిల్లా ఉపాధ్యక్షులు జగన్ మాట్లాడుతూ తూప్రాన్ పట్టణ కేంద్రంలో ఉన్న మాస్టర్ మైండ్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా అడ్మిషన్ పేరుతో ఒక్కో విద్యార్థి వద్ద 25 నుంచి 30వేల వరకు ఫీజు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. అధికారులు కళాశాల గుర్తింపు రద్దు చేయాలని, లేనిపక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు చేపడతామని హెచ్చరించారు.

◆ నోటిఫికేషన్ రద్దుచేయాలి

మెదక్ కలెక్టరేట్: ఏళ్ల తరబడి పని చేస్తున్న తమను కాదని ప్రభుత్వం వేసిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని సెకండ్ ఏఎన్ఎంలు డిమాండ్ చేశారు. రెగ్యులరైజ్ డిమాండ్‌తో సెకండ్ ఏఎన్ఎంలు కలెక్టరేట్ ముందు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం కొనసాగించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు తన్వీర్, తులసి, సంగీత, సులోచన, రమ్య, యాదమ్మ పాల్గొన్నారు.

◆ బీసీలకు తగినన్ని సీట్లు ఇవ్వాలి

నర్సాపూర్: రాష్ట్రంలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ నుంచి బీసీలకు తగినన్ని సీట్లు కేటాయించాలని పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డిని కలిసి కోరినట్లు పీసీసీ డెలిగేట్ ఆంజనేయులుగౌడ్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు నాగరాజు ఆధ్వర్యంలో పలువురు సంఘం ప్రతినిధులు మంగళవారం గాంధీ భవన్‌లో రేవంత్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీని కలిసి బీసీలకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు. రాబోయే ఎన్నికలలో న్యాయం చేయాలని కోరినట్లు ఆయన చెప్పారు.